ప్రజాశక్తి
ఆదివారం 16 జూన్ 2024
5
అల్లూరి సీతారామరాజు



జెన్కో ప్రాజెక్ట్ కోసం..
గ్రామాలు ఖాళీ చేయిస్తే ప్రతిఘటన : సిపిఎం

ప్రజాశక్తి-పాడేరు:జెన్కో నిర్మించే హైడ్రో పవర్ ప్రాజెక్ట్ కోసం గ్రామాలు ఖాళీ చేయాలని ఆదివాసీలను వేధిస్తుండటంపై సిపిఎం జిల్లా కార్యదర్శి పి అప్పల నరస తీవ్రంగా ఖండించారు. ఈ విషయంపై శనివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, సీలేరు లో ఉన్న జెన్కో ప్రాజెక్ట్ విస్తరణకు కొత్త ప్రాజెక్ట్ నిర్మాణం కోసం పార్వతి నగర్‌ను ఖాళీ చేయాలని ఆదివాసీలకు అధికారులు వేధిస్తున్నారన్నారు. సీలేరులో గ్రామ సభను గత ఏడాది నిర్వహించిన అధికారులు ఆదివాసీలకు వాస్తవాలు తెలపకుండా అరకొర సమాచారంతో గ్రామ సభ ఆమోదం తెలియజేసినట్లుగా చేశారన్నారు. గ్రామసభ ఆమోదం నివేదికతో హైడ్రో పవర్ ప్రాజెక్ట్ నిర్మాణం కోసం ఆదివాసీలు నివసిస్తున్న గ్రామాలు ఖాళీ చేయాలని చెబుతుండటం అన్యాయమన్నారు.ఇదే జరిగితే ఆదివాసులు సర్వస్వాన్ని కోల్పోతారని ఆవేదన వ్యక్తం చేశారు.ఆదివాసీలను వేధిస్తే ప్రతి ఘటన తప్పదని హెచ్చరించారు.

విద్యుత్ సౌకర్యం కల్పించాలని..
సిపిఎం నేతల ఆందోళన

ప్రజాశక్తి-అరకులోయరూరల్:మండలంలోని సుంకరమెట్ట పంచాయతీ పరిధిలోని పి.వి.టి.జి మోడల్ కాలనీలో విద్యుత్ సౌకర్యం కల్పించాలని సుంకరమెట్ట సిపిఎం సర్పంచ్ గెమ్మిలి చిన్నబాబు ఆధ్వర్యంలో మోడల్ కాలనీవాసులు శనివారం ఆందోళన నిర్వహించారు.ఈ సందర్భంగా సర్పంచ్ చిన్నబాబు మాట్లాడుతూ, రాష్ట్రంలో ప్రభుత్వాలు మారుతున్నా కాలనీలో మాత్రం విద్యుత్ సౌకర్యం కల్పించ లేకున్నారు. గతంలో టిడిపి ప్రభుత్వంలో పిరిబంద గ్రామానికి మోడల్ కాలనీ మంజూరైందని, సుమారు ఈ కాలనీలో 109 పి.వి.టి. జి కుటుంబాలు నివసిస్తున్నాయని తెలిపారు. ఈ కాలనీ లో విద్యుత్ సౌకర్యం కల్పించకపోవడం, కాలనీ చుట్టూ వైపులా తుప్పలు ఉండటంతో ఏ సమయంలో ఏమి జరుగుతుందోనని భయంతో కారు చీకటిలో నివసిస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. గత వైసిపి ప్రభుత్వానికి ఎన్నిమార్లు విన్నవించినా ఫలితం లేకపోయిందని ఆయన అన్నారు.సుంకరమెట్ట పంచాయతీలో సరిపడ విద్యుత్ పోల్స్ ఏర్పాటు చేసి విద్యుత్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రస్తుత వర్షాకాలం కావడంతో పిరిబంద మోడల్ కాలనీలో నివాసం ఉంటున్న పివిటిజిలు అంధకారంలో ఉండే పరిస్థితి ఏర్పడుతుందని ఆయన అన్నారు. నూతన ప్రభుత్వం స్పందించకుంటే గ్రామస్తులతో కలిసి మండల కేంద్రంలో ఆందోళన చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పిరిబంద మోడల్ కాలనీ నివాసులు కొర్ర సోమ్మా, కొర్ర లైలా సుందరరావు, తదితరులు పాల్గొన్నారు.



నినాదాలు చేస్తున్న సిపిఎం నేతలు, కాలనీ వాసులు

తునికాకు బోనస్ కోసం ఎదురుచూపు..

- రూ.35 కోట్లు పెండింగ్
- పదేళ్లకు పైగా చెల్లించని వైనం
- ఆర్థికంగా నష్టపోతున్న కార్మికులు
- ప్రభుత్వ నిర్లక్ష్యంతో పక్క రాష్ట్రాలకు తరలిపోతున్న బీడీ ఆకు



అడవిలో తునికాకు సేకరిస్తున్న గిరిజనులు

ప్రజాశక్తి-చింతూరు

ఏజెన్సీ ప్రాంతంలో బీడీ ఆకు (తునికాకు) కార్మికులకు ప్రభుత్వం చెల్లించాల్సిన బోనస్ కోసం కార్మికులు ఎదురు చూస్తున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌గా ఉన్న కాలంలో 2012 నుండి 2014 వరకు ఏజెన్సీలో తునికాకు సేకరించిన ఆదివాసీలకు చెల్లించాల్సిన బోనస్ పెంగింగ్‌లో ఉంది. అంతేకాకుండా రాష్ట్ర విభజన తరువాత కూడా అంటే 2015 నుండి 2023 వరకు కూడా సేకరించిన తునికాకు కార్మికులకు విభజన ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం కూడా బోనస్ చెల్లించలేదు. ఈ విధంగా సుమారు 35 కోట్ల రూపాయలు కార్మికులకు చెల్లించకుండా పెండింగ్‌లోనే ప్రభుత్వం పెట్టింది. తునికాకు కార్మికులకు బోనస్ చెల్లించాలని సిపిఎం ఆధ్వర్యంలో అనేక పర్యాయాలు స్థానిక ఐటీడీఏ, డీఎఫ్ఓ కార్యాలయాల ముందు తునికాకు కార్మికులు పోరాటాలు చేశారు. కొంతవరకు బోనస్ రెండు సంవత్సరాలు సంబంధించిన డబ్బులు కార్మికుల ఖాతాలో జమ చేశారని అధికారులు తెలియజేశారు. పెండింగ్‌లో ఉన్న 35 కోట్ల రూపాయలు కార్మికుల ఖాతాలో జమ చేయాలని సిపిఎం ఆధ్వర్యాన కార్మికులు నిత్యం ఆందోళన చేస్తూనే ఉన్నారు.

ప్రాణాలను ఫణంగా పెట్టి తునికాకుల సేకరణ

ఆదివాసీలు పొద్దు పొడవక ముందే మసక చీకట్లో ఇంటిల్లిపాది అడవి బాట పట్టి తునికాకు పొదల్లో లేత ఆకులను సేకరించి ఇంటికి తీసుకువచ్చి కట్టలుగా కట్టి ఆపై వాటిని ఆకుల కల్లాల్లో అందజేశారు. చీకట్లో ప్రమాదకరమైన పాములు, తేళ్లు ఉంటాయని తెలిసి కూడా గిరిజనులు తమ ప్రాణాలను సైతం ఫణంగా పెట్టి తునికాకు పొదాల నుండి ఆకులను సేకరిస్తున్నారు. గతంలో విష సర్పాల బారిన పడి అనేకమంది మృత్యువాత పడిన సందర్భాలు కూడా ఉన్నాయి.

పొరుగు రాష్ట్రాలకు తరలిపోతున్న బీడీ ఆకు

రాష్ట్ర ప్రభుత్వం తునికాకు కార్మికుల సమస్యలను పట్టించుకోకపోవడంతో ఆంధ్రా నుండి ఒడిశా, చత్తీస్‌ఘడ్ రాష్ట్రాలకు కోట్ల రూపాయల విలువైన తునికాకు తరలిపోతుంది. చింతూరు మండలంలోని కల్లేరు, సూరన్నకుంది, గూడూరు, మధుగూరు, కొత్తపల్లి, లక్కవరం, తులసపాక గిరిజన గ్రామాల నుండి తనికాకులను సీలేరు నదిని నాటు పడవలపై దాటించి ఒరిస్సా రాష్ట్రం మోటు తాలూకాలోని నాగారం, పిన్నమదుగురు, మురళిగూడెం గ్రామాలలో ఏర్పాటు చేసిన ఒరిస్సా బీడీ కల్లాల చెందిన వ్యాపారులకు విక్రయిస్తున్నారు. 50 ఆకుల కట్టకు ఆంధ్రాలో కంటే రూపాయి అదనంగా చెల్లించి కొనుగోలు చేస్తూ తక్షణమే పేమెంట్లు చేస్తున్నారు. దీంతో గిరిజనులు తునికి ఆకులను ఒడిశాకు భారీగా తరలిస్తున్నారు. ఆంధ్రాలో తునికాకు కార్మికుల బోనస్లను చెల్లించకుండా పొరుగు రాష్ట్రం కంటే తక్కువగా కట్ట రేటు చెల్లించడం వల్ల లక్షల రూపాయల నష్టం ఆంధ్రకు వాటిల్లుతుందని చెప్పడం అతిశయోక్తి కాదు.

తునికాకు కార్మికుల సమస్యలపై సిపిఎం పోరాటం

తునికాకు కార్మికులకు బోనస్ చెల్లించాలని, వారి సమస్యలను పరిష్కరించాలని సిపిఎం మొదటి నుండి పోరాడుతుంది. బీడీ ఆకుల కార్మికులకు జీవిత బీమాతో పాటుగా వారి కుటుంబానికి భరోసా కల్పించాలని, కట్టరేటు ప్రతి ఏడాది పెరిగిన ధరలకు అనుగుణంగా పెంచాలని, ప్రమాదబారిన పడిన కార్మికులకు తక్షణ సాయం అందజేసి చికిత్స చేయించాలని, ఏజెన్సీ ప్రాంతంలో బీడీ ఆకు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని, బోనస్ డబ్బులు తక్షణమే చెల్లించాలని ఇలా అనేక రకాల డిమాండ్లతో సిపిఎం తనికాకు కార్మికుల పక్షాన పోరాటాలు చేసింది.



బీడీ ఆకులను లెక్కపెట్టి కట్టలు కడుతున్న దృశ్యం



ఎండిన తరువాత బీడీ ఆకులను మూటలు కట్టిన దృశ్యం

మన్యంలో కుండపోత వర్షం

- పొంగిపొర్లిన డ్రైనేజీలు
- రహదారులు జలమయం

ప్రజాశక్తి-డుంబ్రిగుడ:మండలంలో శనివారం పిడుగు శబ్దాలతో కూడిన భారీ కుండపోత వర్షం కురిసింది. వర్షం కారణంగా వీధి కాలువలు, రోడ్లు జలమయంగా మారాయి. అరకు, కురిడి, డుంబ్రిగుడ, కించమండ ప్రాంతాల్లో భారీగా వర్షం కురవడంతో వీధి కాలువలు వరద నీటితో నిండాయి. మండల కేంద్రంలోని వీధి కాలువల్లో చెత్త చెదారం పేరుకు పోయి ఉండడంతో వరద నీరు కాలువల్లో నిల్వ ఉండిపోవడంతో స్థానికులు చెత్తచెదారాన్ని తొలగించడానికి పలు ఇబ్బందులు పడ్డారు. పంచాయతీ అధికారులు స్పందించి వీధి కాలువల్లో పేరుకుపోయిన పారిశుధ్యం తొలగించాలని గ్రామస్తులు కోరుతున్నారు. గత రెండు మూడు రోజుల కురుస్తున్న వర్షాల కారణంగా మండలంలోని పెద్దగడ్డలన్నీ పొంగి ప్రవహిస్తున్నాయి. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు పూర్తిగా ఎండలు కాస్తుండగా మధ్యాహ్నం తర్వాత భారీగా వర్షం కురుస్తుండటంతో ఎండల తీవ్రత నుంచి గిరిజనులు ఉపశమనం పొందుతున్నారు. వ్యవసాయం చేసే రైతులు ఆనంద వ్యక్తం చేస్తూ దుక్కులు దున్నుతూ వ్యవసాయ పనులను ప్రారంభించుకుంటున్నారు.



పాడేరులో కురుస్తున్న వర్షం

పాడేరుటౌన్:

ఏజెన్సీ వ్యాప్తంగా శనివారం ఉరుములు, పిడుగులతో భారీ వర్షం కురిసింది. జిల్లా కేంద్రం పాడేరులో ఉదయం నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు సాధారణ వాతావరణం కొనసాగింది. ఆ తర్వాత నుంచి ఆకాశం మేఘవృతమై వాతావరణంలోని మార్పులు చేసుకున్నాయి. దీంతో కారు మబ్బులు కమ్ముకొని ఒకసారిగా ఉరుములు, పిడుగులతో కూడిన భారీ వర్షం మొదలైంది. సాయంత్రం 6 గంటల వరకు వర్షం కురుస్తూనే ఉంది. భారీ వర్షానికి పట్టణంలోని రోడ్లన్నీ జలమయం కాగా పంట పొలాల్లోకి వర్షం నీరు భారీగా చేరింది. వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. తాజా వర్షాలు వేసవిదుక్కి పనులకు అనుకూలిస్తాయని రైతులు అంటున్నారు.

ఐదు సంతకాలపై టిడిపి నేతల హర్షం

ప్రజాశక్తి- అరకులోయ :ఇచ్చిన హామీల అమలు చేయడంపై అరకులోయలో తెలుగుదేశం పార్టీ నాయకులు ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చిత్రపటానికి శనివారం పాలాభిషేకం చేశారు. ఎన్‌డీఏ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే ఎన్నికల్లో ఇచ్చిన హామీలకు కట్టుబడి ఐదు హామీలను నెరవేరుస్తూ సంతకాలు చేయడంపై టిడిపి నేతలు హర్షం వ్యక్తం చేశారు. ఆ పార్టీ అరకు మండల అధ్యక్షుడు శెట్టి బాబురావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు మాట్లాడుతూ, ప్రతి ఏటా డీఎస్సీ తీస్తామని తప్పుడు హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన వైసిపి ఐదేళ్ల కాలంలో ఒక్క డీఎస్సీ మాత్రమే తీసిందన్నారు. చంద్రబాబు ఇచ్చిన హామీ మేరకు తొలి సంతకం చేయడం సంతోషదాయకమన్నారు. ఏకంగా 16,364 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి త్వరలో నోటిఫికేషన్ ఇచ్చే విధంగా చంద్రబాబు నిర్ణయం తీసుకున్నారన్నారు. ఈ కార్యక్రమంలో పెదలబడు మేజర్ పంచాయతీ సర్పంచ్ పెట్టెలి దాసుబాబు, పద్మాపురం మేజర్ పంచాయతీ మాజీ సర్పంచ్ మహాదేవ్, నియోజకవర్గ సోషల్ మీడియా కన్వీనర్ కిలో నాగరాజు, టిడిపి సీనియర్ నాయకుడు పాడి చందు, కిముడు త్రినాధ్, టిడిపి మహిళా అధ్యక్షులు కిల్లో ద్రౌపతి, గంగా, ఝాన్సీ, సహదేవ్ పాల్గొన్నారు.



చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న టిడిపి నాయకులు



ర్యాలీ చేపడుతున్న వైద్య సిబ్బంది

పొగాకు అనర్థాలపై ర్యాలీ

ప్రజాశక్తి-హుకుంపేట: ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో శనివారం ర్యాలీ నిర్వహించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుండి మూడు రోడ్ల కూడలి వరకు ర్యాలీ చేశారు. పొగాకు మన శరీరంలో ప్రతి అవయవాన్ని నాశనం చేస్తుందన్నారు. పొగాకుతో ఊపిరితిత్తులు, రక్త క్యాన్సర్ వంటి వ్యాదులు ప్రబలుతాయన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ సాంబశివరావు, మూర్తి పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి-ముంచంగిపుట్టు:మండల కేంద్రంలో శనివారం ఆదివాసీ సంక్షేమ పరిషత్ ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో సంక్షేమ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షులు వంతాల నాగేశ్వరరావు మాట్లాడుతూ, ఆదివాసీలు హక్కులు, చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఎస్సీ ఎస్టీ కమిషన్ జిల్లా కమిటీ సభ్యుడు చేండా లోహితాసుడు మాట్లాడుతూ,మహిళల విద్య, వైద్యంపై అవగాహన కలిగి ఉండాలన్నారు.ఆదివాసి సంక్షేమ పరిషత్ నూతన అధ్యక్షుడుగా గంపరాయి కొటిబాబు, ఉపాధ్యక్షులుగా ఆర్ భాస్కర్‌రావు, మండల కార్యదర్శిగా తంగుల జయరాం, సహాయ కార్యదర్శిగా కూడా అనిల్, కోశాధికారిగా పెనుమల చిరంజీవిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో పాడేరు మండల కమిటీ సభ్యులు కొర్ర ఏసుబాబు, గమ్మెల బొంజు బాబు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో రెండు మేకలు మృతి

ప్రజాశక్తి-ముంచంగిపుట్టు:మండలంలోని పెద్దగూడ గ్రామ పంచాయతీకి చెందిన జర్రిపూడి గ్రామంలో విద్యుత్ స్తంభాన్ని తాకడంతో రెండు మేకలు మృతి చెందాయి. జర్రిపూడి గ్రామంలో శనివారం అకాల వర్షానికి విద్యుత్ స్తంభాలకు సరఫరా కావడంతో వాటిని తాకిన ఒలుగు రాంబాబుకు చెందిన రెండు మేకలు అక్కడికక్కడే మృతి చెందాయి. విద్యుత్ శాఖ అధికారులు స్పందించి బాధితుడికి నష్టపరిహారం తక్షణమే ఇవ్వాలని గ్రామస్తులు కోరారు.



మృతి చెందిన మేకలు



మాట్లాడుతున్న ఉత్సవ కమిటీ అధ్యక్షులు అనిల్

నేటి నుంచి మోదకొండమ్మ ఉత్సవాలు

ప్రజాశక్తి-హుకుంపేట:మండల కేంద్రంలో మోదకొండమ్మ ఉత్సవాలను ఈనెల 16,17,18 తేదీలలో నిర్వహిస్తామని ఉత్సవ కమిటీ అధ్యక్షుడు పాంగి అనిల్ తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్ సమీపంలో బజారు వరకు విద్యుత్ దీపాలు ఏర్పాటు చేశామన్నారు. ఈ మూడు రోజుల్లో పండగ సందర్భంగా ట్రాఫిక్ సమస్య లేకుండా దారి మళ్లించడం జరిగిందని ఆయన పేర్కొన్నారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. భక్తులకు ఇబ్బంది కలగకుండా ఆలయంలో ప్రత్యేక సౌకర్యాలను కల్పిస్తున్నామని ఆయన తెలపారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు ప్రసాద్, వెంకట్, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.


ఆదివాసీ స్పెషల్ డిఎస్‌సి ప్రకటించాలి : సిపిఎం

ప్రజాశక్తి -సీలేరు

ఏజెన్సీ ప్రాంత నిరుద్యోగులకు నూతన ప్రభుత్వం ఆదివాసీ స్పెషల్ డిఎస్‌సి ప్రకటించాలని సిపిఎం జికె.వీధి మండల కార్యదర్శి, గాలికొండ ఎంపీటీసీ సభ్యులు అంపరంగి బుజ్జిబాబు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ గత ప్రభుత్వం నిరుద్యోగులకు ప్రతి ఏడాది జాబు క్యాలెండర్ ప్రకటిస్తానని మోసపూరిత వాగ్దానాలు చేసి మోసం చేసిందని పేర్కొన్నారు. వైసిపి ప్రభుత్వం ప్రకటించిన ప్రకారం హామీలు అమలు చేయకపోవడంతో నిరుద్యోగులు తీవ్రంగా నష్టపోయారని ఆందోళన వ్యక్తం చేశారు. 2024 ఎన్నికల్లో వైసీపీకి ప్రజలు, నిరుద్యోగులు తగిన గుణపాఠం చెప్పారని, నూతనంగా ఏర్పడిన తెలుగుదేశం ప్రభుత్వం ప్రజలకు నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను తప్పకుండా అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఏజెన్సీలో 100 శాతం ఉద్యోగాలు గిరిజనులకు వర్తించే జీవో నెంబర్ 3ని పునరుద్ధరించాలని, గిరిజనులకు స్పెషల్ డిఎస్‌సి తీసి నూటికి నూరు శాతం ఉద్యోగాలు కల్పించాలని ఆయన కోరారు.

మాట్లాడుతున్న సిపిఎం నేత బుజ్జిబాబు





రైతులకు విత్తనాలు పంపిణీ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి

ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ రద్దుపై ఈశ్వరి హర్షం

ప్రజాశక్తి-కొయ్యూరు

రైతులకు ఇచ్చిన మాట ప్రకారం రాష్ట్రంలోని టిడిపి ప్రభుత్వం ల్యాండ్ టైటలింగ్ యాక్ట్‌ను రద్దు చేయడం హర్షనీయమని పాడేరు మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి అన్నారు. టిడిపి ఇచ్చిన మాట నిలబెట్టుకుంటుందనడానికి ల్యాండ్ టైటలింగ్ యాక్ట్ రద్దే నిదర్శనమని పేర్కొన్నారు. కొయ్యూరు రైతు భరోసా కేంద్రం వద్ద శనివారం రైతులకు వరి విత్తనాలు ఈశ్వరి చేతులు మీదగా అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులకు సంవత్సరానికి రూ 20 వేలు పెట్టుబడి, వ్యవసాయ యంత్రాలు, పనిముట్లు అందజేస్తామని చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ పీటా సింహాచలం, టిడిపి మండల కార్యదర్శి తోట దొరబాబు, మండల నాయకులు బంటు లక్ష్మణ్ పాల్గొన్నారు.

రాయితీపై విత్తనాల పంపిణీ

రాయితీపై వరి విత్తనాలను మండలంలోని శింగవరం రైతు భరోసా కేంద్రంలో ఎంపీపీ బడుగు రమేష్ చేతుల మీదుగా శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ ప్రభుత్వం మంజూరు చేసిన నాణ్యమైన ఈ విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి ఉమాదేవి, ఎంపీఈఓ సత్తిబాబు, ఉషమణి, వైస్ ఎంపిపి ఎ.నూకాలమ్మ, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి-కొయ్యూరు

మండలంలోని చీడిపాలెం పంచాయతీ పరిధి వట్టి కాలువ వద్ద గుర్తు తెలియని వ్యక్తి చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. నాలుగు రోజుల క్రితం ఆత్మహత్య చేసుకొని ఉండవచ్చని కొయ్యూరు ఎస్సై తెలిపారు. ఈ విషయమై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఆయన తెలిపారు. ఇంకా పూర్తి వివరాలు తెలియవలసి ఉంది.

మలేరియా నివారణపై అవగాహన

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

మండల కేంద్రం రాజవొమ్మంగి వారపు సంతలో శనివారం మలేరియా నివారణ మాసోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. దోమల అంతం మన పంతం అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పలు గ్రామాల నుండి సంతకు వచ్చిన ప్రజలకు మలేరియా నివారణపై మలేరియా సబ్ యూనిట్ అధికారి చీడిపల్లి ప్రసాద్ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో దోమలు ఎక్కువగా వృద్ధి చెందుతాయని, దీని వల్ల ప్రజలు మలేరియా, డెంగ్యూ వంటి వ్యాధులకు గురై ఒక్కొక్కసారి ప్రాణాంతకం అవుతుందని పేర్కొన్నారు. ఈ నేపద్యంలో ప్రతి ఒక్కరూ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని సూచించారు. రాత్రి వేళల్లో నిద్రించేటప్పుడు తప్పక దోమతెరలు వాడాలని, జూన్ నెలలో పిచికారి చేసే ఏసీఎం ఐదు శాతం దోమల నివారణి మందును ప్రతి ఒక్కరూ ఇంటి లోపల బయట స్ప్రేయింగ్ చేయించుకోవాలని కోరారు. కార్యక్రమంలో భాగంగా సంత మార్కెట్ సమీప గృహాల్లో నీటి నిల్వలు ఉన్న కుండీలను ఇతర సామాగ్రిలను పరిశీలించారు. నీటి నిల్వలో ఉంచే వాటిపై తప్పనిసరిగా మూతలు పెట్టి ఉంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది ఎస్ సోమరాజు రెడ్డి, నానిబాబు, రత్నకుమారి, సత్యవతి, పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

పాదచారులపై పిచ్చికుక్క దాడి

ప్రజాశక్తి-పాడేరు: జిల్లా కేంద్రం పాడేరు పట్టణంలో శనివారం ఉదయం సుండ్రుపుట్టు మెయిన్ రోడ్డు పరిసరాల్లో మార్నింగ్ వాక్ కు వెళ్లిన పాదచారుల పై పిచ్చికుక్క దాడి చేసింది. పిచ్చికుక్క స్వైర విహారం చేసి దాడి చేసి కరవడంతో పలువురికి తీవ్ర గాయాల య్యాయి. వీరిలో ఇద్దరు మహిళలు కూడా ఉన్నారు. గాయపడిన వీరందరినీ పాడేరు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి తరలించారు.

పట్టణంలో కుక్కల బెడద..

జిల్లా కేంద్రం పాడేరులో ఊర కుక్కల బెడద ఎక్కువగానే ఉంది. పట్టణ వీధుల్లో రహదారులపై పెద్ద సంఖ్యలో ఊర కుక్కలు సంచరిస్తున్నాయి. వీధుల్లో మనుషులపై దాడులు చేస్తూ ప్రమాదకరంగా మారుతున్నాయి. గత ఆరు మాసాల క్రితం వీధుల్లో సంచరించే కుక్కలకు వ్యాక్సిన్ వేశారు.కుక్కల సంరక్షణ పై ప్రత్యేక దృష్టి సారించి పట్టణ పౌరులకు అపాయం జరక్కుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

రెడ్డి సత్యనారాయణ జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-మాడుగుల: మాజీ మంత్రి రెడ్డి సత్యనారాయణ 99వ జన్మదిన వేడుకల్లో మాడుగుల మోదకొండమ్మ ఆలయ చైర్మన్ పుప్పాల అప్పలరాజు పాల్గొన్నారు. శనివారం మాజీ మంత్రి రెడ్డి సత్యనారాయణ గ్రామం పెద్దగోవాడ స్వగృహంలో నిర్వహించిన జన్మదిన వేడుకలలో పుప్పాల అప్పలరాజు, ఆలయ కమిటీ సభ్యులు కలసి సత్కరించారు. ఈనెల 18న జరిగే మోదకొండమ్మ పండుగ మహోత్సవానికి ఆహ్వాన పత్రిక అందించి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మాడుగుల తెలుగుదేశం నాయకులు రంజిత్ వర్మ, లెక్కలు కాశి బాబు, మాజీ సర్పంచ్ దంగేటి సూర్యారావు, భీమరశెట్టి పైడినాయుడు, పి సూర్యనారాయణరాజు, కుప్పిలి భవాని శంకర్, పొట్నూరి కుమార్ పాల్గొన్నారు.

స్టీల్ బిందెలు పంపిణీ

ప్రజాశక్తి-కొత్తకోట:రావికమతం మండలం కొత్తకోట గ్రామానికి చెందిన ప్రముఖ వ్యాపారి వేత్త పెనుగొండ బంగారం 83వ పుట్టినరోజు వేడుకలను శనివారం కొత్తకోట శివ కేశవ స్వామి ఆలయంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా డీసీఎంఎస్ డైరెక్టర్ సత్యదేవ్, గ్రామ సర్పంచ్ లోవరాజు, ఉప సర్పంచ్ పందల దేవా, టిడిపి సీనియర్ నాయకులు కోట గోవిందరావు చేతుల మీదుగా కేక్ కట్ చేశారు అనంతరం 83 మంది నిరుపేద వృద్ధులు, పారి శుధ్య కార్మికులకు స్టీల్ బిందెలను పంపిణీ చేశారు.వ్యాపార వేత్త పెనుగొండ బంగారంను సర్పంచ్ తోపాటు గ్రామ నాయకులు, ఆర్య వైశ్యులు సంఘం నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆర్య వైశ్య ప్రతినిధులు గున్నాజీరావు, పెనుగొండ నూకేశ్వరరావు, పెనుగొండ వాసు, వందవాసి శ్రీనువాసు తదితరులు పాల్గొ న్నారు....

రైతులకు విత్తనాలు అందజేత

ప్రజాశక్తి రావికమతం :మండల కేంద్రంలోని రైతు భరోసా కేంద్రం వద్ద శనివారం స్థానిక శాసనసభ్యులు కే ఎస్ఎన్ఎస్ రాజు రైతులకు సబ్సిడీపై విత్తనాలను అందజేశారు. ఈ సందర్భంగా శాసనసభ్యులు రాజు మాట్లాడుతూ, రైతాంగానికి ఎరువులు, విత్తనాలు, పనిముట్లు అందుబాటులో ఉంచే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. చంద్రబాబు నాయుడు హయాంలో రైతులకు మేలు చేకూరుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు రాజాన కొండ నాయుడు, స్థానిక సర్పంచ్ గెంజి మోది నాయుడు, గెంజి ఈశ్వరరావు, వ్యవసాయ మండల వ్యవసాయ అధికారిని రూప తదితరులు పాల్గొన్నారు.

చీడికాడ:రైతులకు సబ్సిడీపై వరి విత్తనాలు పంపిణీ చేస్తున్నామని మండల వ్యవసాయ అధికారిని రమాదేవి, గ్రామ వ్యవసాయ సహాయ అధికారి గణేష్ తెలిపారు. మండలంలో జేబీపురం రైతు భరోసా కేంద్రం, చీడికాడ, జి.కొత్తపల్లి, జె.బి.పురం, తునివలస, వింటిపాలెం గ్రామాల్లోని రైతులకు విత్తనాలు పంపిణీ చేశారు. ఆ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గొల్లవిల్లి చిన్నమ్ములు, రాజబాబు, వైస్ ఎంపీపీ ధర్మిశెట్టి స్వాతి కొండబాబు, ధర్మిశెట్టి అప్పలనాయుడు, పేరపు కొండబాబు, కొట్యాడ చిన్నమనాయుడు పాల్గొన్నారు.

సత్తా చాటిన ప్రియాంక

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్:ఈ నెల 10 నుండి 14 వరకు కర్ణాటక రాష్ట్రంలో జరిగిన దక్షిణ అఖిల భారత ఉమెన్ (సౌత్ జోన్) నేషనల్ ఉషు టోర్నమెంట్‌లో నర్సీపట్నంకు చెందిన వేపాడ ప్రియాంక సిల్వర్ మెడల్ సాధించారు. 70 కేజీల విభాగంలో ఆడి ద్వితీయ స్థానంలో నిలిచి ఈ పతకాన్ని కైవసం చేసుకున్నారు. ఈ నేషనల్ టోర్నమెంట్‌లో మెడల్ సాధించడంపై ఆంధ్రా ప్రదేశ్ వూషు అసోసియేషన్ సెక్రటరీ మోహన్ ముత్యాలరావు, నేషనల్ రిఫరీ వెంకట్, శావ్ కోచ్ అబ్బు అభినందించారు.

సిఎం దృష్టికి జిఒ 3 పునరుద్ధరణ అంశం

మాజీ మంత్రి కిడారి శ్రావణ్, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి

ప్రజాశక్తి-పాడేరు టౌన్: రాష్ట్రంలో నిరంకుశ, ప్రజా కంఠక పాలన ముగిసి ప్రజాపాలన శకం మొదలైందని, ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు ప్రమాణ స్వీకారం చేసిన వెంటనే అయిదు హామీల అమలు చేయడంపై అన్ని వర్గాల ప్రజల నుంచి హర్షం వ్యక్తమవుతోందని మాజీ మంత్రి కిడారి శ్రావణ్ కుమార్, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి పేర్కొన్నారు. చంద్రబాబు సంపూర్ణ ఆయురారోగ్యాలతో ఉండాలని పాడేరు మోదకొండమ్మ ఆలయంలో శనివారం పూజలు చేశారు. అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, గిరిజనుల ఉద్యోగావకాశాల జిఒ-3 ప్రయోజనాల పునరుద్ధరణ హామీ అమలుకై ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్తామన్నారు. భూ యాజమాన్య హక్కు చట్టం రద్దు, పింఛన్ల రూ.3 వేల నుంచి రూ.4 వేలకు పెంపు, అన్న క్యాంటీన్ల పునరుద్ధరణ, మెగా డిఎస్‌సి ప్రకటన, నైపుణ్య గణన కార్యక్రమాలు ప్రజలందరికీ మేలు చేసేవేనన్నారు. ఈ కార్యక్రమంలో పాడేరు, అరకు నియోజకవర్గాల టిడిపి నేతలు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

పాఠ్యపుస్తకాల పంపిణీ


పుస్తకాలను పంపిణీ చేస్తున్న ఎంఇఒ

ప్రజాశక్తి-హుకుంపేట: మండలంలోని పలు పాఠశాలల ఉపాధ్యాయులకు మండల విద్యా శాఖ అధికారి కూడ ఈశ్వరరావు పాఠ్యపుస్తకాలను శనివారం పంపిణీ చేశారు. అనంతరం ఎంఇఒ మాట్లాడుతూ, విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. సకాలంలో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు ఇవ్వాలని సూచించారు. విద్యార్థులు చదువుపై దృష్టి సారించి మంచి ఫలితాలు వచ్చే విదంగా ఉపాధ్యాయులు బాధ్యత వహించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో సిఆర్ పిలు ఎం.కృష్ణ, గంగారావు, వసంత, భవాని తదితరులు పాల్గొన్నారు.

రాజకీయాల్లో గెలుపు ఓటములు సహజం

మాజీ ఎమ్మెల్యే కంబాల జోగులు

ప్రజాశక్తి-కోటవురట్ల: ఎన్నికల్లో ఓటమి నేపథ్యంలో వైసిపి మండల స్థాయి సమావేశం శనివారం తంగేడు గ్రామంలో నిర్వహించారు. వైసిపి మండల పార్టీ అధ్యక్షుడు కిల్లాడ శ్రీనువాసరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన మాజీ ఎమ్మెల్యే కంబాల జోగులు మాట్లాడుతూ, గెలుపు ఓటములు సహజమన్నారు. కష్టించి పనిచేసినా ఫలితం లేకపోవడంపై ఎవరూ నిరాశ చెందవద్దన్నారు.ఈ సందర్భంగా పలువురు వైసిపి ఓటమికి గల కారణాలపై అభిప్రాయాలను వెల్లడించారు. గ్రామస్థాయి నాయకులను పట్టించుకోకపోవడంతో ఓటమి పాలయ్యామని పలువురు అభిప్రాయం వ్యక్తం చేశారు. గ్రామస్థాయిలో నాయకులకు సముచిత స్థానం లభించకపోవడమే ప్రధాన కారణమని మండల ఉపాధ్యక్షులు దత్తుడు రాజు అన్నారు. పందూరు, జల్లూరు వంతెనలు అసంపూర్తిగానూ, అడ్డు రోడ్డు ప్రధాన రహదారి అధ్వానంగా ఉండటం ఓటమికి కారణమని మాజీ ఎమ్మెల్సీ డివి సూర్యనారాయణరాజు అన్నారు. మండల పార్టీ అధ్యక్షులు శ్రీనివాసరావు మాట్లాడుతూ శ్రేణులు ఎవరు అధైర్య పడవలసిన పనిలేదని ప్రభుత్వ వైఫల్యాలను ఎప్పటికప్పుడు నిలదీయాలని కోరారు.. ఈ కార్యక్రమంలో బిసి సెల్ అధ్యక్షులు రమేష్, సిద్ధ బత్తుల సత్తిబాబు, పలువురు ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆరిలోవ అటవీ ప్రాంతంలో..

రంగురాళ్ల తవ్వకాల కలకలం

ప్రజాశక్తి-గొలుగొండ:మండలంలో ఆరిలోవ అటవీ ప్రాంతంలో శుక్రవారం రాత్రి రంగురాళ్ల తవ్వకాలు కలకలం రేపాయి. అటవీ సిబ్బంది పర్యవేక్షణలో ఉండే బేస్ క్యాంపునకు ఆనుకుని ఈ తవ్వకాలు జరగడంపై పలు అనుమానాలు కలుగుతున్నాయి. ఆరిలోవ అటవీ ప్రాంతంలో ఏడాదికాలం క్రితం రంగురాళ్ళ క్వారీ బయటపడింది. గతంలో తవ్వకాలు జరిగిన నాటి నుండి అటవీ శాఖ ఆధ్వర్యంలో క్వారీ ప్రాంతంలో బేస్ క్యాంప్‌ని నిర్వహిస్తున్నారు. నిత్యం ఇద్దరు సిబ్బందితో రాత్రి, పగలు పహారా కాస్తున్నారు. అయినప్పటికీ శుక్రవారం రాత్రి క్వారీలో తవ్వకాలు జరగడం పలు అనుమానాలను కలిగిస్తుంది. నిత్యం సిబ్బంది పహారాలో ఉన్న క్వారీలో తవ్వకాలు జరిగాయంటే సిబ్బంది సహకారం ఉన్నట్టా? లేనట్టా?. సిబ్బంది సహకారం లేకుండా తవ్వకాలు ఎలా జరుగుతాయని పలువురు విమర్శిస్తున్నారు. శనివారం ఉదయం పత్రికా విలేకరుల బృందం క్వారీ ప్రాంతాన్ని పరిశీలించగా మట్టి తవ్విన ఆనవాళ్లు కనిపించాయి. రాత్రి సమయంలో తవ్విన మట్టి నుండి లక్షల రూపాయలు విలువచేసే రంగురాళ్లు చేతులు మారాయని పలువురు చర్చించు కుంటున్నారు. క్వారీలో అధికారులకు తెలియకుండా తవ్వకాలు జరిగే పరిస్థితి లేదు. దీనిపై అటవీశాఖ ఉన్నతాధికారులు దృష్టి సారించి తవ్వకాలు జరగడానికి కారణాలను వెలికి తీయాలని ఈ ప్రాంతీయులు కోరుతున్నారు. ఈ విషయాన్ని అటవీశాఖ నర్సీపట్నం సెక్షన్ ఆఫీసర్ సత్యనారాయణ దృష్టికి తీసుకువెళ్లగా క్వారిలో తవ్వకాలు ఎక్కడా జరగలేదన్నారు.



ఆకట్టుకుంటున్న ఎద్దు బండి

ప్రజాశక్తి - ఆరిలోవ : ఈ చిత్రాన్ని చూస్తే అచ్చంగా ఒక ఎద్దు బండిని లాగుతూ బ్రిడ్జిపై ప్రయాణం చేస్తున్నట్టు కనిపిస్తుంది. అలా అనుకుంటే పొరపాటే. ఇది నిజంగా ఎద్దు బండి కాదు. జాతీయరహదారి ఆనుకొని ఉన్న పాతడెయిరీఫారం కూడలి వద్ద జివిఎంసి సుందరీకరణలో భాగంగా ఏర్పాటు చేసిన ఎద్దు బండి బొమ్మ. జాతీయరహదారిని ఆనుకొని ఉన్న ఖాళీప్రదేశంలో చుట్టూ రెయిలింగ్ ఏర్పాటుచేసి ఈ బుల్లక్ కార్ట్‌ను ఏర్పాటు చేశారు. ఆదర్శనగర్ నుంచి జాతీయరహదారి వైపు వచ్చిన ప్రయాణికులకు, వాహనదారులకు ఒక బ్రిడ్జిపై నిజంగా ఎద్దు బండి ప్రయాణిస్తున్నట్టు కనిపిస్తుంది. జాతీయరహదారిపై ప్రయాణించే వాహనదారులు, పాదచారులను ఆకర్షిస్తుంది.

సుగర్‌పై అవగాహన అవసరం

ప్రజాశక్తి- గాజువాక : సుగర్ పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని కిమ్స్ ఐకాన్ హాస్పిటల్ కన్సల్టెంట్ ఎండోక్రైనాలజి డాక్టర్ శ్రావణి తెలిపారు. అవగాహన కోసం ఈ నెల 12 నుంచి 18 తేదీ వరకు జాతీయ మధుమేహ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. మధుమేహంలో ప్రధానంగా టైప్ 1, టైప్ 2, గెస్టేషనల్ అంటే గర్భిణీ స్త్రీలలో వచ్చే మధుమేహం ఎక్కువగా చూస్తున్నామని తెలిపారు. మధుమేహంతో ఉన్న వారిలో దాదాపుగా 90 శాతం కన్నా ఎక్కువగా టైప్ 2 బాధితులేనని వివరించారు. మధుమేహం (డయాబెటిస్ మెల్లిటస్) ఉన్న వారిలో ఎక్కువగా కనిపించే లక్షణాలు తరచూ మూత్రం రావడం, ఆకలి, దాహం ఎక్కువగా ఉండటం, ఆకస్మికంగా బరువు తగ్గడం, ఎక్కువగా అలసట, కంటి చూపు మందగించటం/ మసక బారడం, అరికాళ్ల మంటలు, తిమ్మిర్లు, చర్మం మీద ఫంగల్ ఇన్ఫెక్షన్లు, తరచూ మూత్ర నాళ ఇన్ఫెక్షన్లు, గాయాలు తొందరగా మానకపోవడం తదితర లక్షణాలు కనిపిస్తాయని వివరించారు. అశ్రద్ధ వహిస్తే మధుమేహ వ్యాధి ప్రభావం తీవ్రమై గుండెపోటు, పక్షవాతం బారిన పడతారని తెలిపారు. ఎటువంటి వ్యాధి లక్షణాలు లేకున్నా సరే అధిక బరువుతో ఉన్నవారు, అధిక రక్తపోటు (బిపి), గుండె జబ్బులున్నవారు, తల్లిదండ్రుల్లో మధుమేహం, రక్తంలో కొలెస్ట్రాల్ స్థాయిలు అధికంగా ఉన్న వారు, శారీరక శ్రమ ఎక్కువగా లేనివారు రక్త పరీక్షలు చేయించుకోవడం ద్వారా సుగర్ వ్యాధిని గుర్తించవచ్చని పేర్కొన్నారు. క్రమబద్ధంగా రక్త పరీక్షలు చేయించుకుంటూ, సరైన ఆహార నియమాలు పాటిస్తూ, వ్యాయామం చేస్తూ, వైద్యుల సలహా మేరకు మందులు వాడితే మధుమేహాన్ని అదుపులో ఉంచుకోవచ్చని తెలిపారు.

ఎంవివి కుటుంబ సభ్యుల కిడ్నాప్‌పై పునర్విచారణ చేపట్టాలి

ప్రజాశక్తి-సీతమ్మధార : విశాఖ మాజీ ఎంపీ ఎంవివి.సత్యనారాయణ కుటుంబ సభ్యుల కిడ్నాప్‌పై పునర్విచారణ చేపట్టాలని జనసేన పార్టీ కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్ డిమాండ్ చేశారు. పౌర గ్రంథాలయంలో శనివారం ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఆ కిడ్నాప్ అంతా ఒక డ్రామా అని ఆరోపించారు. వైసిపి పెద్దలు ఆడిన నాటకం అన్నారు. అప్పటి పోలీసు అధికారులు ఎంవివితో కుమ్మక్కయ్యారని ఆరోపించారు. నిందితుడు వెంకట్‌కు ఐదు కార్లు గిఫ్ట్‌గా ఇచ్చిందెవరని ప్రశ్నించారు. ఖరీదైన విల్లాస్, ఫ్లాట్స్ భూములు ఎవరిచ్చారని ప్రశ్నించారు. డేగా టీం గాంగ్ స్టర్స్‌తో ఎంవివికి సంబంధం ఏమిటో తేల్చాలన్నారు. ప్రభుత్వం మారిన నేపథ్యంలో తిరిగి విచారణ జరపాలని కోరారు. ఉత్తరాంధ్ర జిల్లాల్లో ఎన్నారై స్థాయి వ్యక్తుల నుంచి పేద ప్రజల వరకు అనేక భూదందాలు మాజీ ఎంపీ ఎంవివి.సత్యనారాయణ, గన్నమనేని వెంకటేశ్వరరావు దోచుకు తిన్నారని ఆరోపించారు. వీటిపై సిబిఐతో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.


చిన్నారి ఆరోగ్య విషయాలను శివానందను అడిగి తెలుసుకుంటున్న ఎంపీ తనూజరాణి

చిన్నారిని పరామర్శించిన ఎంపీ తనూజరాణి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : అల్లూరి జిల్లా కేంద్రం పాడేరులో అగంతకుల దాడిలో గాయపడి కెజిహెచ్ గైనకాలజీ వార్డులో చికిత్స పొందుతున్న చిన్నారిని అరకు పార్లమెంటు సభ్యురాలు డాక్టర్ గుమ్మ తనూజరాణి శనివారం పరామర్శించారు. కెజిహెచ్ సూపరిండెంటెంట్ డాక్టర్ శివానందతో మాట్లాడి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకొని, మెరుగైన వైద్యం అందించవలసిందిగా కోరారు. చిన్నారి ఆరోగ్యం కుదుటగానే ఉన్నట్టు కెజిహెచ్ ఆసుపత్రి వైద్య బృందం తెలిపింది. ఈ సందర్భంగా ఎంపీ తనూజరాణి మాట్లాడుతూ ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని, మానవ సమాజంలో చిన్నారులపై ఇలాంటి దుర్ఘటనలు జరగడం దురదృష్టకరమని అన్నారు. ఇలాంటివి పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఎంపీ వెంట వైసిపి రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి చెట్టి వినయ్ వున్నారు.

గురుకులంలో ప్రవేశానికి దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి-చింతూరు : చింతూరులోని ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలో 2024-25 విద్య సంవత్సరానికి గాను ప్రవేశానికి విద్యార్థుల నుండి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఆ పాఠశాల ప్రిన్సిపల్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మూడో తరగతి ఇంగ్లీష్ మీడియంలో 60 సీట్లు ఉండగా వాటిలో ఎస్సీ-1, బీసీ-1, ఓసి-1, ఎస్టీ 59 సీట్లు ఉన్నాయని పేర్కొన్నారు. నాలుగో తరగతి ఇంగ్లీష్ మీడియంలో ఖాళీగా 26 సీట్లు ఉన్నాయని, వాటిని ఎస్టీలకు మాత్రమే కేటాయించడం జరుగుతుందని తెలిపారు. ప్రవేశాల కోసం పాఠశాల పని వేళల్లోనూ, లేదా 9490957272, 9440876808 ఫోన్ నెంబర్లకు సంప్రదించాలని ప్రిన్సిపాల్ కోరారు.

సీలేరు గురుకులంలో...

సీలేరు : జీకే వీధి మండలం సీలేరు ఏపీ గురుకుల పాఠశాలలో ఐదు, ఆరు తరగతుల్లో ప్రవేశానికి ఆసక్తి గల విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ఆ పాఠశాల ప్రిన్సిపాల్ బుచ్చిబాబు పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఏపీ గురుకుల పాఠశాలలో ప్రభుత్వం కల్పిస్తున్న వసతి, ఉచిత భోజన సౌకర్యం విద్యార్థులు పొందవచ్చునన్నారు. ఆరో తరగతి అడ్మిషన్లు ఈనెల 25తో గడువు పూర్తవుతుందని, జిల్లాలో ఆసక్తిగల విద్యార్థులు ముందుగానే పాఠశాల పని వేళల్లో సంప్రదించి ఉచితంగా దరఖాస్తులు పొందవచ్చునని వెల్లడించారు.

20 నుంచి బ్యాడ్మింటన్ టోర్నమెంట్లు

ప్రజాశక్తి-రంపచోడవరం : అల్లూరి సీతారామరాజు బాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 20 నుండి 25వ తేదీ వరకు అండర్ 40-ఠాగూర్ మెమోరియల్ బాడ్మింటన్ టోర్నమెంట్, 40 ఏళ్లు పైబడిన వారికి బుల్లిదొర మెమోరియల్ బాడ్మింటన్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు టోర్నమెంట్ కన్వీనర్లు నాగేంద్ర కుమార్, సురేష్ రెడ్డి, అభిషేక్, కమిటీ సభ్యులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీల్లో ఏజెన్సీ మండలాలకు చెందిన నాన్ మెడలిస్ట్ క్రీడాకారులు అందరూ పాల్గొనవచ్చని పేర్కొన్నారు. ఈ టోర్నమెంట్ కేవలం పురుషుల డబుల్స్ విభాగంలో మాత్రమే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రంపచోడవరం ఐటిడిఎ ఇండోర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ఈ పోటీలు నిర్వహిస్తున్నామని, విజేతలకు నగదు బహుమతులు అందజేమని వెల్లడించారు. మొట్టమొదటిసారి రంపచోడవరం ఇండోర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో నిర్వహిస్తున్న ఈ టోర్నమెంటులో ఏజెన్సీ బాడ్మింటన్ క్రీడాకారులందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ పోటీలలో పాల్గొనదల్చిన వారు రిజిస్ట్రేషన్ ఇతర వివరాల కోసం రమేష్ 9014229091, నాగేంద్ర 6303049191 ఫోన్ నెంబర్లకు సంప్రదించాలని సూచించారు.

నోటిఫికేషన్ సరే...

ఉపాధ్యాయ ఖాళీలపై స్పష్టతేదీ ?

చంద్రబాబు 'తొలి సంతకం' మెగా డిఎస్‌సిపై పలు ప్రశ్నలు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

ముఖ్యమంత్రి చంద్రబాబు 16,347 టీచర్ పోస్టుల భర్తీకి సంబంధించి చేసిన 'తొలి సంతకం'పై నేడు సర్వత్రా చర్చ సాగుతోంది. నోటిఫికేషన్ విడుదలై.. ఉపాధ్యాయ నియామకాలు ప్రారంభమై.. స్కూల్ రిజిష్టర్‌లో ఉపాధ్యాయుడు సంతకం పెట్టే వరకూ ఎప్పుడూ టెన్షన్ వాతావరణమే కొన్నేళ్లుగా నెలకొంటోంది. గత ప్రభుత్వం డిఎస్‌సిపై జారీచేసిన జిఒ, సర్క్యులర్‌లను కొత్త ప్రభుత్వం రద్దు చేయాల్సి ఉంది. డిఎస్‌పి నోటిఫికేషన్‌పై టిడిపి కూటమి ప్రభుత్వం చేసిన ప్రకటన శుభపరిణామమే అయినా జిల్లాల వారీగా ఖాళీల వివరాలపై ఇప్పటికీ స్పష్టత కొరవడింది. ఖాళీల వివరాలను ప్రభుత్వం ఇంతవరకూ రప్పించుకునే ప్రయత్నం జరిగిందా ? అంటే లేదనే చెప్పాలి. విశాఖ జిల్లా విద్యాశాఖాధికారులకు సైతం జిల్లాలో వివరాలపై స్పష్టత లేకపోగా ప్రభుత్వం కూడా కోరలేదన్న సమాధానం వారి నుంచి వినిపిస్తోంది.

గతంలో ఏం జరిగింది ?

జగన్ సర్కారు 172 సర్క్యులర్‌ను గతంలో ఇచ్చి 3 కిలోమీటర్లలోపు ఉన్న పాఠశాలలను విలీనం చేసింది. ఈ నిర్ణయం సరైంది కాదని ప్రోగ్రెసివ్ డెమొక్రటిక్ ఫ్రంట్ (పిడిఎఫ్) ఎంఎల్‌సిలు, యుటిఎఫ్ పెద్ద ఎత్తున పిల్లలు, వారి తల్లిదండ్రులతో రాష్ట్రంలోని అన్ని స్కూళ్లు, ఎంఆర్‌సిల వద్ద ఆందోళనలు చేపట్టిన విషయం తెలిసిందే. ప్రభుత్వ పాఠశాలలు మనుగడ సాగించలేవని రాష్ట్ర వ్యాప్తంగా బస్సు యాత్రను కూడా పిడిఎఫ్ ఎంఎల్‌సిలు చేపట్టారు. దీంతో ప్రభుత్వం దిగొచ్చి ఒక కిలోమీటరుకు పరిధిని తగ్గించారు. 117 జిఒను జగన్ సర్కారు ఇవ్వడం వల్ల పాఠశాలల విలీనంతో పోస్టులు చాలా వరకూ మిగిలిపోయాయి. హైస్కూల్స్‌లో చాలా పోస్టులు మెర్జ్ అయిపోయి ఉండిపోయాయి. ముఖ్యంగా జగన్ సర్కారు కేవలం ఇంగ్లీషు మీడియంను నిర్బంధంగా అమలు చేసింది. తెలుగు, ఇంగ్లీషు మీడియంలను సమాంతరంగా నడిపించగలిగితే తప్ప పాఠశాలలు మనలేవన్న డిమాండ్ యుటిఎఫ్, ఇతర సంఘాల నుంచి వినిపించింది.


వాటిని రద్దు చేస్తేనే పాఠశాలలకు మనుగడ

పాఠశాలల భవిష్యత్తు కోసం రెండు మీడియంలను సమాంతరంగా నిర్వహించాలి. గత ప్రభుత్వం 172 సర్క్యులర్, 117 జిఒలను తేవడం వల్ల పోస్టులు చాలా మిగిలిపోయాయి. కాబట్టి వాటిని రద్దు చేయాలి. వీటిపై ప్రతిపక్షంలో ఉండగా నిర్వహించిన యువగళం పాదయాత్రలో ఇచ్చిన హామీని ప్రస్తుత విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ నెరవేర్చాలి. ప్రభుత్వ స్కూళ్లలో పిల్లల నమోదు కూడా గతంలో సరిగ్గా లేదని ప్రైవేట్ వాళ్లు పిల్లలను పట్టుకెళ్లిపోయారు. అమ్మకు వందనం పథకం కూడా కొత్త ప్రభుత్వం ప్రభుత్వ స్కూళ్లకే పరిమితం చేయాలి.

టిఆర్.అంబేద్కర్, యుటిఎఫ్ విశాఖపట్నం జిల్లా ప్రధాన కార్యదర్శి


దర్పం కాదు.. దార్శనికత కావాలి

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి : కొత్త ప్రభుత్వం కొలువుదీరింది. మంత్రివర్గ కూర్పు ఉమ్మడి విశాఖ జిల్లాలోని సీనియర్ల ఆశలను తలకిందులు చేసింది. అనుభవం, పార్టీ విధేయత కంటే నమ్రతకు చంద్రబాబు అధిక ప్రాధాన్యత ఇచ్చినట్లుంది. చంద్రబాబు, లోకేష్‌కు అత్యంత విశ్వసనీయమైన వ్యక్తిగా గుర్తింపు పొందిన పాయకరావుపేట ఎమ్మెల్యే వంగలపూడి అనితకు కీలకమైన హోం, విపత్తుల నిర్వహణ శాఖ లభించింది. ఇక తనదాకా మంత్రి పదవిరాదని గ్రహించేమో, సీనియర్లకు పదవులిస్తే, కొత్త వారికి అవకాశాలెప్పుడు వస్తాయంటూ అయ్యన్న తనకుతాను సర్దిచెప్పుకున్నారు. ఇంతకంటే మరో దారి అయ్యన్నకు కన్పించివుంటే, ఆయన ప్రతిస్పందన మరోలా వుండేది. అయ్యన్న వంటి సీనియర్లను పక్కనబెట్టడం మంచిదికాదనేమో, తరువాత చంద్రబాబు పిలిచి తగిన గుర్తింపు సీనియర్లకు ఇస్తామని చెప్పి పంపించారు. స్పీకర్ పదవి ఆశ అయ్యన్నకు లేకపోలేదు. అందుకనే మంత్రివర్గంలో స్థానం దొరక్కపోయినా దిగులుతో కనబడకుండా ధీరత్వం ప్రదర్శిస్తున్నారు. మరోవైపు ఆశావహుల్లోని నిరాశను వదిలించేందుకు చంద్రబాబు సంస్థాగత దిద్దుబాటు ప్రారంభించినట్లుంది. టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడును మంత్రివర్గంలోకి తీసుకోవడంతో ఆ అధ్యక్ష స్థానాన్ని గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావుతో భర్తీచేసి సంతృప్తిపర్చాలని చూస్తున్నారు.



ఇకపోతే... కక్షలు, ప్రతీకారాలు వుండవంటూనే తప్పుచేసిన వారెవరినీ వదిలిబెట్టబోమని బెదిరింపులకు దిగడం ఆందోళన కలిగిస్తోంది. తప్పు ఎవరు చేసినా, ఎప్పుడు చేసినా తప్పించుకోడానికి వీల్లేని వ్యవస్థలను బలహీనం చేస్తున్నది పాలక ప్రభుత్వాలే. తప్పు చేసిన తమ వారిని కాపాడ్డం, కాని వారిని బాధ పెట్టడం పరిపాటిగా మారడంతో ఆ కొద్దిమంది ఎప్పుడూ తమకనుకూల కాలంలో చెలరేగిపోతున్నారు. ప్రభుత్వ పెద్దల మనసెరిగి మసలుకొని బతకడానికి అలవాటుపడ్డ అధికారులు సందర్భోచితంగా బట్టి ప్రతిస్పందిస్తున్నారు. అనేక నెలల పాటు సిరిపురం జంక్షన్‌కు వెళ్లే మార్గాన్ని స్టాపర్లతో మూసినప్పుడు కళ్లు తెరవని పోలీసులు ప్రభుత్వం మారగానే కళ్లు తెరిచి వాటిని తొలగించిన తీరు చూస్తుంటే అధికారమెంత భయంకరంగా మనుషులను విన్యాసాలు చేయిస్తుందో అర్థమవుతుంది. చేసింది తప్పని తెలిసినా, సరిదిద్దడానికి కూడా సాహసించలేని, ధైర్యంలేని ఆ ప్రభుత్వ యంత్రాంగం దేనికి ? అధికార పార్టీ పెద్దల చుట్టూ ప్రదక్షిణలు చేసుకొని, కాలక్షేపం చేయడానికా ? చట్టపరిధిలో పనిచేయాల్సిన యంత్రాంగం వెన్నుఎముకలేనిదిగా వ్యవహరించబట్టే, రాజకీయ నాయకుల తప్పులకు నియంత్రణ లేకుండాపోతోంది. పాలనా వ్యవస్థను గాడిలో పెట్టాల్సిన వారే ప్రతీకారం తీర్చుకుంటామని చట్టానికి అతీతుల్లా మాట్లాడం ప్రజాస్వామ్య విలువలకు ప్రమాదం. ప్రభుత్వ భూముల ఆక్రమణలపై సిట్ వేసిన టిడిపి, వైసిపి ప్రభుత్వాలు రెండూ ఆ నివేదికను బహిర్గతం చేయలేదంటే ఇవి ఎవరిని రక్షిస్తున్నాయో ప్రజలు అర్థం చేసుకోవాలి. 'తల్లియున్నయపుడె తనదు గారాబాము, లామె పోవదన్ను నరయరెవరు, మంచికాలమపుడె మర్యాదనార్జింపు' అని వేమన చెప్పినట్లు తల్లి బతికివున్నప్పుడు పిల్లల గారాబము సాగినట్లు, కాలం కలిసి వచ్చినప్పుడే గౌరవ మర్యాదలు ఆర్జించుకోవాలి. లేదంటే అవెందుకు పనికిరాకుండా పోతాయి. కక్షలూ, కార్పణ్యాలు వదిలి ఉమ్మడి విశాఖ జిల్లా సమగ్రాభివృద్ధికి ప్రణాళికలు రూపొందించి అమలుజరిగేలా పట్టుబట్టి సాధించినప్పుడే ఎన్నికైన వారికి గౌరవం దక్కుతుంది.

విద్యుత్ వైర్లను తాకిన చెట్టు కొమ్మలను తొలగించాలి


విద్యుత్ వైర్లను తాకిన చెట్టు కొమ్మలు

ప్రజాశక్తి - సీలేరు : జీకే వీధి మండలం దేవరాపల్లి పంచాయతీ మంగళపాలెం గ్రామంలో విద్యుత్ తీగలకు తాకి ఉన్న చెట్టు కొమ్మలను ట్రాన్స్‌కో సిబ్బంది తొలగించాలని ఆ గ్రామస్తులు డిమాండ్ చేశారు. ఈ గ్రామంలోని నేరేడు చెట్టు కొమ్మలు విద్యుత్ వైర్లకు తాకుతుండడంతో ప్రమాదాలు జరుగుతాయని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం నేరేడు పళ్ళు సీజన్ కాబట్టి పిల్లలు పళ్ళు కోసం ఆశపడి చెట్లు ఎక్కే ప్రయత్నం చేస్తే విద్యుత్ షాక్‌కు గురయ్యే ప్రమాదం ఉందని గ్రామస్తులు అంటున్నారు. ఇప్పటికైనా ట్రాన్స్‌కో అధికారులు స్పందించి విద్యుత్ తీగలు తాకి ఉన్న చెట్లు కొమ్మలను తక్షణమే తొలగించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

కోటక్ జన్ 2 జన్ ప్రారంభం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : కోటక్ మహీంద్రా లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ, కోటక్ లైఫ్ కొత్త రక్షణ ప్రణాళిక కోటక్ జన్ 2 జన్ ప్రొటెక్ట్‌ను ప్రారంభించినట్లు కంపెనీ ఎమ్‌డి మహేష్ బాల సుబ్రహ్మణియన్ తెలిపారు. నగరంలోని ఓ హోటల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ 100 శాతం హామీతో ఈ ప్రీమియం ప్రయోజనం ఉంటుందన్నారు. పిల్లలకు పూర్తి రిస్క్ కవర్‌ను బదిలీ చేసే సౌలభ్యాన్ని అందిస్తుందని తెలిపారు. తల్లి, తండ్రి (ప్రాథమిక జీవిత బీమా) 60, 65 సంవత్సరాల వయసులో ఉన్నప్పుడు, అదనంగా ఈ రిస్క్ కవర్ 60 సంవత్సరాల వయస్సు వరకు పిల్లలతో ఉంటుందన్నారు. ఇది యాక్సిడెంట్ డెత్ బెనిఫిట్, పర్మినెంట్ డిసేబిలిటీ బెనిఫిట్, క్రిటికల్ ఇల్‌నెస్ ప్లస్ వంటి సమగ్ర కవరేజ్‌ని కూడా అందిస్తుందని తెలిపారు. మహిళా పాలసీదారులకు అదనంగా ఐదు శాతం మరణ ప్రయోజనాన్ని అందిస్తుందని తెలిపారు.

చదువుతోనే ఉజ్వల భవిష్యత్తు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : చదువుతోనే మంచి భవిష్యత్తు సాధ్యమని విశాఖ పార్లమెంట్ సభ్యులు ఎం.శ్రీభరత్ విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు. ఎతిహాద్ ముస్లిం కమ్యూనిటీ వెల్ఫేర్ సొసైటీ విశాఖపట్నం ఆధ్వర్యంలో అర్హులైన, వెనుకబడిన విద్యార్థులకు వార్షిక స్కాలర్‌షిప్‌ల పంపిణీ కార్యక్రమం శనివారం సాయంత్రం వెంకోజీపాలెంలోని సిఎంఆర్ ఫంక్షన్ హాల్‌లో జరిగింది. దీనికి ముఖ్య అతిథిగా హాజరైన శ్రీభరత్ విద్యార్థులతో మాట్లాడారు. వారి భవిష్యత్తు కార్యాచరణను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పిల్లలను, ముఖ్యంగా ఆడపిల్లలను చదివిస్తున్న తల్లిదండ్రులను అభినందించారు. ఎతిహాద్ ముస్లిం కమ్యూనిటీ వెల్ఫేర్ సొసైటీ సేవలను మెచ్చుకున్నారు. కార్యక్రమంలో విశాఖ తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, సొసైటీ అధ్యక్షులు ఐహెచ్.ఫరూకీ, కార్యదర్శి జాఫర్ హుస్సేన్, కోశాధికారి రియాజ్ ఖాన్ పాల్గొన్నారు.

టిప్పర్ల కుంభకోణంపై దర్యాప్తు జరపాలి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : జివిఎంసిలో మొక్కలకు నీరు పోసే టిప్పర్ల నిర్వహణ సమయంలో కాంట్రాక్టర్లు అధికారులతో కలిసి పెద్ద ఎత్తున దోపిడీకి పాల్పడిన వ్యవహారంపై దర్యాప్తు జరిపి అందుకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని సిపిఐ విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు విజ్ఞప్తి చేశారు. శనివారం జివిఎంసి కమిషనర్‌కు ఈ మేరకు తాను ఫిర్యాదు చేసినట్టు మీడియాకు ఆయన తెలిపారు. జివిఎంసి 98 వార్డులలో మొక్కలకు నీరుపోసేందుకు 11 మంది గుత్తేదార్లు టెండర్లు దక్కించుకొని, మొక్కలకు మంచినీటి ట్యాంకర్ల ద్వారా పోస్తున్నారన్నారు. ఇటీవల 2600 ట్రిప్పులు నీరుపోసామని, దానికి బిల్లులు చెల్లించాలని గుట్టుచప్పుడు కాకుండా రూ.60 లక్షలు కాజెయ్యాలనుకోవడం, అందుకు జివిఎంసి అధికారులు సహకరించడం దుర్మార్గమన్నారు. ఈ వ్యవహారంలో జిపిఎస్ నమోదు చేసినవి కేవలం 900 ట్రిప్పులు మాత్రమేనని బయటపడడంతో ఈ కుంభకోణం వెలుగులోకి వచ్చిందన్నారు.

ఎంపీ శ్రీభరత్‌కు వంశీ శుభాకాంక్షలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖ ఎంపీగా భారీ మెజార్టీ సాధించిన ఎం.శ్రీభరత్‌ను విశాఖ దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ శనివారం మధ్యాహ్నం ఎంవిపి.కాలనీలోని ఎంపీ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. దక్షిణ నియోజకవర్గంలో అత్యధిక శాతం ఓట్లతో తొలి ఎమ్మెల్యేగా గెలుపొందడానికి సహకరించిన భరత్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో జనసేన పార్టీ సీనియర్ నేతలు సునీల్, మోహిత్ తదితరులు పాల్గొన్నారు.